ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

# ఉపాధి హామీకి పాలకుల సంకెళ్లు

**- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

ఉపాధి హామీ పథకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంకెళ్లు వేస్తున్నాయని, పేదలకు పట్టెడు అన్నం పెట్టే పథకాన్ని శాశ్వతంగా దూరం చేసే ప్రయత్నం ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని వి. వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణతో కలసి పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు 9 వారాలైనా నేటికి వేతనాలు ఇవ్వడం లేదని, రూ.లక్ష పది వేల కోట్లు బడ్జెట్ ఉన్న పథకానికి కేవలం రూ 85 వేల కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తుంటే ఈ ప్రభుత్వాలకు పేదలు బడుగు బలహీన వర్గాలంటే ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని అన్నారు. 9 వారాలైనా బిల్లులు అందకపోతే పేదలు ఏం తిని బతకాలని వారు ప్రశ్నించారు. రెండు పూటల పని విధానాన్ని తీసుకొచ్చి పథకానికి పేదలను దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వ్యవసాయ కూలీలకు భూమిలేని పేదలకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. 18 సంవత్సరాల నిండిన వారందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, టెంట్లు సరఫరా చేయాలని వారు అన్నారు. మేట్లకు పారితోషకం రూ.ఐదు రూపాయలు ఇవ్వాలని, పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు చనిపోతే రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. పై డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు పేదలందరూ పాల్గొనాలని వారు వ్యవసాయ కూలీలకు విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో సిఐటియు కల్లూరు మండల కార్యదర్శి కె.మధు, స్థానిక నాయకులు రాజు, కె. రాజు, గ్రామ వ్యవసాయ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలతో సతమతం..!

- మహిళలను వేధిస్తున్న ఇబ్బందులు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అన్నింటా సమాన హక్కులు ఉండాలని చెబుతున్నా 'ఆమె' సమస్యలతో సతమతం అవుతోంది. మహిళలను పలు ఇబ్బందులు వేధిస్తున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సమస్యలపై కథనం...

**సమస్యలతో సతమతం**

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

గత కొన్ని సహస్రాబ్దాలుగా మహిళలు మార్పులకు దూరంగా ఉన్నారు. పురాతన కాలం నుండి మధ్యయుగ కాలంలో భారతదేశంలో పురుషులు, మహిళలు ఇద్దరికీ సమాన హక్కులను అనేక మంది సంస్కర్తలు ప్రోత్సహించారు. అయితే మహిళలు అత్యాచారం, యాసిడ్ దాడులు, వరకట్న హత్యలు, బలవంతపు వ్యభిచారం వంటి హింసను నిరంతరం ఎదుర్కొంటున్నారు. ఆధునిక భారతదేశంలో సతి, జౌహర్ మరియు దేవదాసి పద్ధతులు నిషేధించబడ్డాయి. సమాజంలో స్త్రీల మధ్య హింసకు కారణమయ్యే ఈ పద్ధతులు మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి. భారతదేశం లోని మహిళల ప్రస్తుత స్థితి అనేక సవాలక్ష సమస్యలను ఎదుర్కొం టోంది. మహిళా, శిశు అభివృద్ధి శాఖ నివేదిక ప్రకారం భారతదేశంలో దాదాపు 70 శాతం మంది మహిళలు గృహ హింసకు గురవుతున్నారు. వరకట్న వ్యవస్థ అనేది భారతదేశంలోని ఆర్థిక వ్యవస్థ, ఇది వధువు కుటుంబంపై ఆర్థిక భారంగా మారింది. దిగువ తరగతి కంటే పై తరగతి కుటుంబం వరకట్న వ్యవస్థలో నిమగ్నమై ఉండే అవకాశం ఉంది. ఆధునిక భారతదేశంలో వరకట్నం ఒక సామాజిక విపత్తుగా మారింది. ఆ ఆచారం కారణంగా మహిళలు అనేక రకాల అఘాయిత్యాలకు, వేధింపులకు గురవుతున్నారు, వాటిలో అత్యంత క్రూరమైన, అమానవీయమైనది వరకట్న హత్య. ఉన్న ప్రాంతాల్లో ఉపాధి లేకపోవడం వల్ల మహిళలు దూర ప్రాంతాలకు పని కోసం వెళ్లాల్సి వస్తోంది. పని ప్రదేశాల్లోనూ మహిళలు వేధింపులకు గురవుతున్నారు. మద్యం రక్కసి వల్లే మహిళలపై దాడులు, వేధింపులు పెరిగిపోయా యని మహిళా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

**- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎన్.అలివేలు ప్రజాశక్తితో మాట్లాడుతూ మహిళలపై అమ్మాయిలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి చట్టాలను అమలు చేసి న్యాయం చేయాలి. ఈ మధ్యకాలంలో ప్రాథమిక విద్య నుండి కళాశాల స్థాయి వరకు చదువుతున్న అమ్మాయిలను ఏదో రకాలుగా ఇబ్బందులను గురి చేస్తూ వారు చెప్పినట్లు వినకపోతే మిమ్మల్ని పరీక్షల్లో మార్కులు తక్కువ వేస్తాం. ఫెయిల్ చేస్తామంటూ విద్యార్థుల్లో నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దే ప్రధాన ఉపాధ్యాయులు ఇలాంటి దారుణాలకు వడి గొడుతున్నారు. పేరెన్నిక గన్న ఎమ్మిగనూరు బనవాసి గురుకుల పాఠశాల, కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థినులను వేధించి బలవంతం చేశారు. ఇలాంటివి ప్రతిరోజు ఎక్కడో ఒకచోట జరుగుతున్నాయి. కానీ వెలుగులోకి వచ్చేవి కొన్ని మాత్రమే కనుక ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడే ఉపాధ్యాయులను పూర్తిగా ఉద్యోగం నుండి తొలగించి కఠినంగా శిక్షిస్తే తప్ప ఇతరులకు భయం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా ఉచిత బస్సు జిల్లా వరకే పరిమితమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పడం బాధాకరం. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణం అమలు చేయాలి. మద్యం నియంత్రిస్తామని అధికారంలోకి రాకముందు చంద్రబాబు నాయుడు చిలుక పలుకులు పలికి నేడు మద్యాన్ని ఏరులై పారించి మహిళల మానప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్నారు.

**మార్చి 8నే మహిళా దినోత్సవం ఎందుకు..?**

1908లో న్యూయార్క్ నగర వీధుల్లో తమ హక్కుల సాధన కోసం వేలాది మంది మహిళా కార్మికులు నిర్వహించిన వీరోచిత పోరాటానికి గుర్తుగా మార్చి8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించారు. సుమారు 15 వేల మంది మహిళలు మహిళాహక్కుల ఉద్యమ నేత క్లారా జెట్కిన్ నేతత్వంలో ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. దీంతో పాటు మహిళలు ఓటు వేయాలనే డిమాండును కూడా ఇందులో చేర్చారు. కఠినమైన పని పరిస్థితులు, ఎక్కువ పని గంటలు, తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా ఈ నిరసన సాగింది. ఆ మహిళల జ్ఞాపకార్థం 1909 ఫిబ్రవరి 28న అమెరికాలో తొలిసారిగా మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. 1909లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించింది. 1917లో మొదటి ప్రపంచ యుద్ధంలో, రష్యా మహిళలు శాంతి ఉద్యమం చేపట్టారు. దీంతో రష్యా 'చక్రవర్తి నికోలస్' తన పదవికి రాజీనామా చేశాడు. మహిళలకు ఓటు హక్కు కూడా లభించింది. ఈనేపథ్యంలోనే యూరోప్ మహిళలు మార్చి 8న శాంతి కార్యకర్తలకు మద్దతుగా ర్యాలీలు చేపట్టారు. ఉద్యమాల ఫలితానే 1975లో ఐక్యరాజ్యసమితి మార్చి 8ని 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'గా ప్రకటించింది.

## సమాజానికి వెన్నెముక మహిళలు

**- పోతుల శ్రీదేవి, ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్**

సమాజాభివృద్ధికి మహిళలు వెన్నెముకలా ఉన్నారు. నేటి సమాజంలో దేనికి వెరవకుండా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. అవనిలో ఆకాశంలో మహిళలు సగం భాగంగా ఉంటున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8 మాత్రమే జరుపుకోవడం కాదు ప్రతిరోజు మహిళా దినోత్సవమే అన్నది నా ప్రగాఢ విశ్వాసం. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదనిపిస్తోంది. పార్వతీపురం దగ్గర అత్యంత రిమోట్ ఏరియాలోని కుటుంబం నుంచి వచ్చాను.పదేళ్ల క్రితం మా గ్రామానికి టెలిఫోన్ పరిచయమైంది. నాన్న సిఐగా పనిచేశారు. నన్ను కూడా అదే శాఖలో ఉన్నత స్థాయిలో చూడాలన్నది ఆయన ఆశయం. కలెక్టర్ కావాలన్నది అమ్మ ఆశయం. తొలుత ఎంపిడిఒగా ఆపై గ్రూప్ వన్ రాసి సూపరింటెండెంట్‌గా పని చేస్తూ ఉత్తమ అవార్డులు సాధించా. ఎంతో సంతోషంగా ఉంది. నాన్న స్ఫూర్తినింపగా భర్త నా ప్రతి పనిలో అండగా నిలిచారు. మహిళలకు తెలియని శక్తి వారిలో ఉంది. దాన్ని ఉపయోగించి సమాజాభివద్ధిలో భాగస్వామ్యం కావాలి.

## బ్యూటీషియన్ రంగంలో ఉపాధి

**- ప్రముఖ బ్యూటీషియన్, గ్లామ్ స్టూడియో అధినేత కె.సునీత**

బ్యూటీషియన్ రంగంలో మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని ఎంతోమంది మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడ్డానికి అవకాశం కల్పిస్తుందని ప్రముఖ బ్యూటీషియన్, గ్లామ్ స్టూడియో అధినేత కె.సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ మహిళలు ఉన్నతంగా ఎదగాలని అందుకు ఆర్థిక తోడ్పాటు అవసరమన్నారు. అందుకు బ్యూటీషియన్ రంగం తోడ్పడుతుందని, మా వద్ద శిక్షణ తీసుకున్న మహిళలు విదేశాల్లో కూడా ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆమె అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహిళా హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**- టి సయ్యద్ సబిహా పర్వీన్, డిఎండబ్ల్యుఒ, కర్నూలు**

ప్రాథమిక హక్కులను మహిళలకు రాజ్యాంగం కల్పించింది. హక్కులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మహిళా సాధికారత, జాతిని బలపరచడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. మహిళల విజయాలు, సాధికారత అంశాలను మహిళల్లో నింపే చైతన్యం చేయాలన్నది ఈ రోజు ప్రత్యేకత. దేశంలో మహిళలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నా రు. తామేమి తక్కువ కాదంటూ అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తుండడం అభినందనీయం. లింగ బేధం లేకుండా, అసమానతలు వివక్షత లేకుండా సమానత్వం దిశగా సమాజంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రతి మహిళ తమ సత్తాను చాటాలి.

## రెక్కల కష్టంతోనే చదివించుకున్నాం

**- అడ్డా కూలి రాములమ్మ గుడిపాడు**

భర్త మద్దిలేటి తాను కలిసి రెక్కల కష్టంతోనే పిల్లలను చదివించుకున్నాం పెళ్లిళ్లు చేసాం. భర్త కొత్త బస్టాండులో హమాలీగా పని చేస్తాడు. మట్టి పని చేస్తే నాకు రోజుకు 500 కూలి వస్తది. వారంలో మూడు రోజులు మాత్రమే పని ఉంటుంది. మిగతా రోజుల్లో పని దొరక్క ఇంటికి పోవాల్సిన పరిస్థితి ఉంటుంది. సంతోష్ నగర్‌లో కొట్టం వేసుకొని జీవనం జరుపుతున్నాం. ఇద్దరు ఆడపిల్లలకు మనువు ఇచ్చాం. ఒక కొడుకు ను పిహెచ్‌డి దాకా చదివించాను. తిరుపతిలో కాంట్రాక్టు ఉద్యోగం చేసేవాడు. కాంట్రాక్టు అయిపోవడంతో ఇంటికి తిరిగి వచ్చాడు. మళ్లీ ఉద్యోగం కోసం కృషి చేస్తున్నాడు.

## మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

**- ఎంఇఒ శోభారాణి**

**కౌతాళం :** మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంఇఒ-2 శోభారాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ... విద్య, వైద్య, రాజకీయం, వ్యాపారం, సామాజిక రంగాల్లో రాణించాలంటే విద్యావంతులు కావడం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం పురుషులతో పాటు అన్ని రంగాల్లోనూ పోటీ పడడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రతి కుటుంబానికీ మహిళ వెన్నెముకగా నిలిచి ముందుకు నడిపిస్తోందన్నారు.

# పదో తరగతిలో ఉత్తీర్ణులు కావాలి

**- కలెక్టర్ పి.రంజిత్ బాషా**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ప్రతి విద్యార్థి పదవ తరగతిలో ఉత్తీర్ణులు కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బష విద్యార్థులను ప్రోత్సహించారు. శుక్రవారం కర్నూలు ఎస్‌ఎపి క్యాంప్‌లోని నగర పాలక ఉన్నత పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ ఉపాధ్యాయుడి గా మారి విద్యార్థులకు గణితం సులభంగా అర్థమయ్యే విధంగా టిప్స్ నేర్పించారు. కలెక్టర్ పదవ తరగతి గదిలో గణితం బోధిస్తున్న సబ్జెక్ట్ టీచర్ తో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? ఎంతమంది హాజరయ్యారు? వివరాలను కలెక్టర్ గణిత సబ్జెక్ట్ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ పరీక్షల్లో మ్యాథ్స్ సబ్జెక్టులో ఏ విధంగా గుర్తు పెట్టుకోవాలి? మ్యాథ్స్‌లో సమస్యలను ఏ విధంగా సులభంగా పరిష్కరించాలో చిట్కాలు నేర్పిస్తున్నారా అని కలెక్టర్ గణిత సబ్జెక్ట్ టీచర్ ని ఆరా తీశారు. విద్యార్థుల్లో కొంతమంది స్లో లెర్నర్స్ ఉంటారని, అలాంటి విద్యార్థులకు మ్యాథ్స్ సులువుగా అర్థం అయ్యేలా బోధించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. గణితంలో ఒక సమస్యను తీసుకొని, ఏ విధంగా పరిష్కరించాలని కలెక్టర్ ఒక విద్యార్థితో పానెల్ బోర్డ్ మీద చేయించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా పదవ తరగతి విద్యార్థులకు ఏ విధంగా గుర్తుపెట్టుకోవాలో స్వయంగా విద్యార్థులకు బోధించారు. గణిత సమస్యలను పార్టులుగా విభజించుకుని, పరిష్కరించినట్లయితే సమాధానం చాలా బాగా గుర్తుంటుందని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల ఆవరణంలో శుభ్రత మెయింటెయిన్ అనంతరం మధ్యాహ్న భోజనంను కలెక్టర్ తనిఖీ చేశారు. అన్నం వండడానికి ఫిల్టర్ వాటర్‌ను వినియోగించాలని, అందువల్ల అన్నం నాణ్యతగా ఉంటుందని కలెక్టర్ హెడ్మాస్టర్‌ను ఆదేశించారు. గుడ్లను పరిశీలించి, గుడ్ల సైజు చిన్నగా ఉన్నాయని, గుడ్లను సప్లయ్ చేస్తున్న సంబంధిత ఏజెన్సీకి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఫోన్ చేసి డిఇఒను ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. హెడ్‌మాస్టర్ వెంకటరెడ్డి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కలెక్టరేట్‌లో షీ బాక్సును ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

# కలెక్టరేట్ లో షీ బాక్స్ ఏర్పాటు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

కలెక్టరేట్‌లో ఎపిజెఎసి అమరావతి కర్నూలు జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన షీ బాక్స్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళా ఉద్యోగులు బహిరంగంగా చెప్పలేని సమక్షంలో షీ బాక్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సూచించారు. వేధింపులకు గురిచేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ వెంకటనారాయణమ్మ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఎఒ సింధు సుబ్రహ్మణ్యం, ఎపిజెఎసి అమరావతి జిల్లా అధ్యక్షులు కెవై.కృష్ణ , మహిళా విభాగం ఛైర్‌పర్సన్ సహెరాభాను, శివపార్వతి, ఎపిఆర్‌ఎస్‌ఎ ఉపాధ్యక్షులు ఎపిజెఎసి అమరావతి సహాధ్యక్షులు, పద్మావతి, జిఎస్ ఎపిజెఎసి అమరావతి మహిళా విభాగం, మహిళలు ప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# 'ఇంగ్లీష్ కార్నివాల్'కు విశేష స్పందన

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

మాట్లాడుతున్న పిబివి సుబ్బయ్య

కర్నూలు నగరంలో మాధవి నగర్ రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూలు , రెవెన్యూ కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్స్‌లో షేక్ స్పియర్ జయంతి సందర్భంగా 'ఇంగ్లీష్ కార్నివాల్ వారోత్సవాలు' కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య అధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ కార్యాక్రమాలకు విశేష స్పందన లభించింది. ముఖ్య అతిధిగా ప్రముఖ పట్టణ ఆంగ్ల ఉపన్యాసకురాలు సునీత రోజ్ పాల్గొన్నారు. ఇంగ్లీషు ప్రాముఖ్యతను కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య వివరించారు. ఇంగ్లీషు లాంటి ప్రపంచ భాషను నేర్చుకోవాల్సిన కనీస కర్తవ్యం మనందరి బాధ్యత అని తెలపారు. ప్రముఖ పట్టణ ఆంగ్ల ఉపన్యాసకురాలు సునీతరోజ్ మాట్లాడుతూ ఇంగ్లీషుభాష అనేది గ్లోబలైజ్డ్ లాంగ్వేజ్అని, దీనిని నేర్చుకోవటం సులభమే అన్నారు. విద్యార్థులు మొదట ఎక్కువగా వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం ద్వారా సులభతరం అవుతుందని అన్నారు. తరువాత మంచి ఫన్నీ స్క్రిప్ట్, డ్యాన్సులను పిల్లలు చేసి, వాటిలో ఇంగ్లీషును చాల చక్కగా మాట్లాడి వారి ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల తల్లులకు 'ఉమెన్స్ డే' సందర్భంగా మ్యూజికల్ చైర్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు.ఈ సమావేశంలో ప్రిన్సిపల్, కోఆర్డినేటర్స్, ఆంగ్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేశారు.

# జనరిక్ మందుల పై అవగాహన కల్పించాలి

**-ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపి**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

జన ఔషధ దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ప్రధానమంత్రి జనరిక్ మందుల షాపును కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు ప్రారంభించారు. ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ సూపరింటెంటెడ్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ, ఔషధ నియంత్రణ పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ ఎటివి.రమాదేవి హాజరయ్యారు. కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జనరిక్ మందులపై అందరికీ అవగాహన కలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పార్లమెంటులో తనకు మొదటి సారి మాట్లాడే అవకాశం ఆరోగ్యం పై వచ్చిందని అందులో భాగంగా జనరిక్ మందుల పైనే మాట్లాడానన్నారు. జనరిక్ మందుల పై ప్రజలు అపోహలు చెందాల్సిన అవసరం లేదని.. బ్రాండెడ్ మందుల లాగానే ఈ మందులు పని చేస్తాయని తెలిపారు. బ్రాండెడ్ మందులతో పోల్చుకుంటే జనరిక్ మందులు అతి తక్కువ ధరలకే లభిస్తాయన్నారు. ఇక పట్టణాలలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం జనరిక్ మందులపై అవగాహన కలిపించేలా కృషి చేయాలని అధికారులకు ఎంపి సూచించారు. నాణ్యమైన మందులు సరసమైన ధరలకు అందు బాటులో ఉండేలా జనరిక్ మందులను ప్రోత్సహించేదుకు ప్రధాన మంత్రి జన్‌ఔషధి కేంద్రాలు ప్రారంభించామని అన్నారు. ఈ కేంద్రాల్లో మార్కెట్ లో లభించే బ్రాండెడ్ మందుల ధర కంటే 50-80 శాతం తక్కువకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు మధుమేహం, రక్తపోటు, గ్యాస్ట్రో మొదలైన అన్ని ప్రధాన విభాగాల ఔషధాలు జన్‌ఔషధి యోజన కింద అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఔషధ నియంత్రణ పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ ఎటివి రమాదేవి మాట్లాడుతూ జన ఔషధ దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లాలో 13, నంద్యాల జిల్లాలో 11 ప్రధానమంత్రి జనరిక్ మందుల షాపులను ప్రారంభిస్తురని తెలిపారు. జన ఔషధి కేంద్రంలోని జనరిక్ మందులను ఎంపి బస్తిపాటి నాగరాజు పరిశీలించి జనరిక్ మందులను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు డి.హరిహరతేజ, షేక్‌పర్వీన్ సుల్తానా, షాపుఓనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి బస్తిపాటి నాగరాజు

## మహిళా సాధికారతకు ప్రభుత్వాలు కృషి చేయాలి

**శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**



మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. మహిళలు అనేక రకాలుగా పోరాటం చేయడం ద్వారా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడింది. గతంలో మహిళల హక్కులు ఉండేవి కాదు. మహిళా సంఘాలు ఇతర సంఘసంస్కర్తలు పోరాటాల ద్వారానే కొంతమేరకు మహిళలకు హక్కులు వచ్చాయి. భారత రాజ్యాంగంలో సమాన హక్కులు రాసుకున్న ఆచరణలో అమలు కావడం లేదు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా మహిళలకు సంబంధించి ఏమాత్రం న్యాయం జరగడం లేదు. మహిళా సాధికారత అని కల్లబొల్లి మాటలు చెప్పడం తప్ప వాస్తవంగా లేదు. నేటి మహిళలపై పెద్ద ఎత్తున హింస అత్యాచారాలు హత్యలు పెరిగాయి. అయినా ప్రభుత్వాలు స్పందించడం లేదు.

## మహిళలకు కుటుంబం, సమాజ ప్రోత్సాహం అవసరం

**డ్రగ్స్ నియంత్రణ పరిపాలన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎటివి. రమాదేవి**

**పజాశక్తి-కర్నూలు హాస్పిటల్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు మరింత ముందుకు వెళ్లాలంటే కుటుంబం, సమాజ ప్రోత్సాహం అవసరం. అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పురుషుల ప్రోత్సాహం కూడా అవసరం. మహిళలు మరింత ముందుకు వెళ్లాలంటే కుటుంబం సమాజం ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలి. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా ఆరోగ్య రంగంలో నా వంతు కషి చేస్తున్నాను. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరూ అన్ని రంగాల్లో మరింత ఉన్నతంగా రాణించాలి.

# నాటు సారా తయారు చేయొద్దు

**-నవోదయం 2.0 లో భాగంగా ప్రజలకు అవగాహన**

**- అబ్కారి శాఖ డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

నాటు సారాయి తయారీని మానివేయాలని అబ్కారి శాఖ డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని బంగారు పేటలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలకు నాటు సారా తయారీ నష్టాలు గురించి అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పోతుల శ్రీదేవి మాట్లాడుతూ... నాటుసారా వలన ప్రజలు అనర్థాలను చవిచూడాల్సి వస్తుంది అన్నారు. అనేక ఆరోగ్య సమస్యలు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. నాటు సారాను తయారు చేయడం చట్టరీత్య నేరమ్మన్నారు. నాటుసారాను తయారు చేయడం, సేవించడం మానుకోవాలని అన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎం.సుధీర్ బాబు మాట్లాడుతూ నాటసారా వలన కలుగు అనర్థాలను వివరించి తదుపరి నాటు సారా చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆర్.హనుమంతరావు, జిల్లా సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, సిఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, జయరాం నాయుడు, ఇతర సిబ్బంది తోపాటు మెప్మా పీడీ, సిడిపిఒ ఐసిడిఎస్ సూ పర్వైజర్, హెడ్మాస్టర్, వీఆర్వో, పోలీసు ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇతర డిపార్టుమెంట్ల వారు సూచనలు సలహాలు అందజేశారు. నాటసారాను పూర్తిగా మానివేయాలని కోరారు.

మాట్లాడుతున్న అబ్కారి శాఖ డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి

బ్యాంకు ఉద్యోగుల నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న నాగరాజు

# బ్యాంకు ఉద్యోగుల 48 గంటల సమ్మె ప్రారంభం

**యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్‌లు**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ పిలుపు మేరకు తొమ్మిది సంఘాల సమైక్యతతో మార్చి 24, 25న 48 గంటలపాటు 2 రోజుల నిరంతర సమ్మెను జయప్రదం చేయాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం యుఎఫ్‌బియు పిలుపు మేరకు దేశపు నలుమూలలా బ్యాంకింగ్ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారం కోసం యుఎఫ్‌బియు, 9 సంఘాల బ్యాంకు ఉద్యోగులు మార్చి 24, 25వ తేదిలలో నిరవదిక సమ్మె చేపట్టనున్నారని తెలిపారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం జిల్లా హెడ్ క్వాటర్స్‌లో నిరసనలు తెలిపేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాయత్రి ఎస్టేట్స్‌లో సుమారుగా 420 మంది బ్యాంకు ఉద్యోగులు నిరసనలు తెలిపారు.

**డిమాండ్లు:** ఐదురోజుల బ్యాంకింగ్ అమలు, ఐడిబిఐ ప్రైవేకరణకు వ్యతిరేకించాలి, బ్యాంకు అధికారుల సిబ్బంది భద్రతకు, బ్యాంకు ఉద్యోగాలపై జరిగే దాడులకు వ్యతిరేకంగా, అన్నికేడర్లలో తగిన నియామకాలు తాత్కాలిక ఉద్యోగుల రెగ్యులరైజ్ చేయాలని, ఐబిఎతో పెండింగ్ వున్న న్యాయమైన కోర్కెల పరిష్కారానికి, రాబోయే 48 గంటల సమ్మె కోసం ప్రతి ఒక్క బ్యాంకు ఉద్యోగి సమాయత్తం అవ్వాలని కార్యచరణ ప్రణాలికలు ఏర్పాటు చేశామని యుఎఫ్‌బియు జిల్లా కన్వీనర్ నాగరాజు, ఎఐబిఒసి నాయకులు మురళీకృష్ణ, రవి, ఎన్‌సిబిఇ నాయకులు విద్యాసాగర్, శ్రీకాంత్, ప్రవీణ్, సహ ఉద్యోగులు రవి, నూర్ బాషా, రాజు, ఆంజనేయులు, విశ్వనాద్, విజయ్, సమీర్, విటల్, మధు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మోసపోయిన వాల్మీకులకు న్యాయం చేయండి

**ముఖ్యమంత్రికి వినతి**

**ప్రజాశక్తి- పత్తికొండ**

రాష్ట్రం లో మోసపోయిన వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి, న్యాయం చేయాలని బోయ క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనసభ ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అడ్వకేట్ బోయ క్రాంతి నాయుడు వినతిపత్రాన్ని అందజేశారు. బోయలకు 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సత్యపాల్ కమిటీ రిపోర్ట్ ,కారెం శివాజీ 'ఎపి ఎస్సీ, ఎస్టీ కమిషన్" నివేదికల ఆధారంగా తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపారన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ బాబునాయుడు, బైటప్పనాయుడు, చంద్ర, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలపై ఒత్తిడి తొలగించాలి

**- విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం**

**- డాక్టర్ ఛాయేంద్ర కుమార్**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులను పరీక్షలు అంటే భయం, మానసిక ఒత్తిడి, ఆందోళన తొలగించి వారిని మానసిక ఆరోగ్యవంతులుగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సమగ్ర శిక్ష పిఎంయు కోఆర్డినేటర్ డాక్టర్ ఛాయేంద్ర కుమార్ తెలిపారు. గోనెగండ్లలోని కెజిబివి పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కెరీర్, మెంటల్, హెల్త్ కౌన్సిలర్ సుచరిత పని తీరును పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కెరీర్, మెంటల్, హెల్త్ కౌన్సిలర్లను నియమించిందని తెలిపారు. వీరు ప్రతి వారమూ ఒక పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు.. ముఖ్యంగా పరీక్షలపై భయం, ఆందోళన, ఒత్తిడి వంటి మానసిక సమస్యలతో పాటు మొబైల్ గేమ్స్ అడిక్షన్.. తదితర ప్రవర్తన సమస్యలను గుర్తించి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తారని చెప్పారు. వారిని మానసిక ఆరోగ్యవంతులుగా తయారు చేసి సరైన క్రమశిక్షణలో పెట్టి, విద్యార్థుల సహజ సామర్థ్యాలను గుర్తించి జీవితంలో స్థిరపడటానికి వివిధ రకాల కోర్సులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ విధమైన కౌన్సెలింగ్ విధానం కేవలం కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు నవోదయ, సైనిక్, ఏకలవ్య వంటి పాఠశాలలకు మాత్రమే పరిమితమైన కౌన్సెలింగ్ విధానం రాష్ట్ర ప్రభుత్వం... ప్రభుత్వ పాఠశాలకు తీసుకురావడం శుభపరిణామమని తెలిపారు. ఎంఇఒ-2 నీలకంఠం, ప్రిన్సిపల్ విద్యావతి పాల్గొన్నారు.

# మహిళ విద్యతోనే అభివృద్ధి : డీఎస్పీ

**ప్రజాశక్తి - ఆదోని**

మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

మహిళ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని డీఎస్పీ హేమలత తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో 'అమ్మాయిల విద్య - సమాజ అభివృద్ధి' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ హేమలత హాజరయి మాట్లాడారు. విద్యార్థినులు చదువుపై శ్రద్ధ పెడితే వారి కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని, సైబర్ క్రైమ్ బారిన పడి మోసపోవద్దని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ... విద్యార్థినుల చదువుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అమ్మాయిలకు పెళ్లి, వరకట్నం కంటే చదువే ప్రధానమనే చైతన్యం కుటుంబాల్లో రావాలని తెలిపారు. జ్యోతిర్మయి కరస్పాండెంట్ మురళీ బాబు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జీవిత మాట్లాడుతూ... అమ్మాయిలు కేసులు చాలా వస్తున్నాయని, మోసపోకుండా బాగా చదివి మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ సాయినాథ్, ఎస్ఎఫ్ఐ మహిళా నాయకులు హసినాభాను పాల్గొన్నారు.

# 'తమ్ముళ్ల' పంచాయితీ

**ప్రజాశక్తి - కోసిగి**

బ్యానర్లను, టెంట్లను దహనం చేసిన నాయకులు

మండలంలోని కోల్మాన్ పేట గ్రామానికి చెందిన తెలుగు తమ్ముళ్లు ఒకరిపై ఒకరు దూషించుకుంటూ, గొడవలు పడి తలనొప్పిగా మారుతున్నారు. కోల్మాన్ పేట గ్రామానికి చెందిన ఉప్పలపాటి అర్జున్ అనే టిడిపి కార్యకర్త చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా సొంత డబ్బులతో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించాలనుకున్నారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయాలనుకున్నారు. ఈ పోటీలు శుక్రవారం ప్రారంభం కావాల్సి ఉంది. టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేష్ తనకు సమాచారం లేదని, మండల కన్వీనర్ అని తెలిసినా తమకు ఎందుకు చెప్పడం లేదని ఆగ్రహించారు. తెల్లవారుజామున క్రికెట్ పిచ్‌ను ట్రాక్టర్‌తో టిల్లర్ కొట్టించి, షామియాలను, కుర్చీలను దహనం చేసి, బ్యానర్లను సైతం చించి వేశారని క్రికెట్ ఆర్గనైజర్ ఉప్పలపాటి అర్జున్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకులు ఇద్దరినీ పిలిపించి మందలించి, సముదాయించారు. పోలీసు స్టేషన్‌కు పంచాయితీ చేరడంతో విషయం కాస్త గ్రూపులో బాగా హల్‌చల్ అయింది. సొంత నిధులతో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తే తనకు సపోర్టు చేయాల్సింది పోయి.. ఇలా చేయడం సరైంది కాదని అర్జున్ ఆవేదన వ్యక్తం చేశారు. క్రికెట్ పోటీలు జరుగుతాయా, తమ్ముళ్ల పంచాయితీ సర్దుబాటు అవుతుందా వేచి చూడాలి.

**మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు**

# రూ.28 వేల వేతనమివ్వాలి

**- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు**

**ప్రజాశక్తి - ఆదోని**

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఆప్కాస్‌ను కొనసాగిస్తూ, నెలకు రూ.28 వేల వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, యూనియన్ నాయకులు సోమన్న, పీరా, కర్రెప్ప, అహ్మద్ మాట్లాడారు. ఇంజినీరింగ్ కార్మికులు దాదాపు 30 ఏళ్లుగా వాటర్ సప్లయి, ఎలక్ట్రికల్, వీధి దీపాలు వేయడం, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు తదితర విభాగాల్లో పని చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కింద ప్రభుత్వం చాలీచాలని వేతనమిస్తూ పని చేయించుకుంటోందని వాపోయారు. కనీస వేతనం నెలకు రూ.28 వేలు ఇచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ విధానం వల్ల కార్మికులకు న్యాయం జరిగేదని, ఈ విధానాన్ని రద్దు చేసి కాంట్రాక్టర్లకు అప్పజెప్పే విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు. కనీసం పదేళ్ల సర్వీస్ ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తెలిపారు. మరణించిన కార్మికుల కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న వారికి యూనిఫారం, రక్షణ పరికరాలను, పనిముట్లను ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగ, కార్మికులు మూర్తి, శివ, బాష, కైలాస్, దాదా పీర్, ఈరన్న, శివరాం, రామాంజనేయులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు

# స్టేట్ బ్యాంకును కిందికి మార్చాలి

**- సిపిఎం నాయకులు**

**ప్రజాశక్తి - కోసిగి**

స్థానికంగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిని పై అంతస్తు నుంచి కిందికి మార్చాలని సిపిఎం నాయకులు కోరారు. శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు రాముడు, వీరేష్ మాట్లాడారు. స్టేట్ బ్యాంక్ పై అంతస్తులో ఉండడం వల్ల బ్యాంక్ అవసరాల నిమిత్తం వచ్చే వృద్ధులకు, వికలాంగులకు, గర్భిణులకు మెట్లు ఎక్కేందుకు చాలా ప్రయాస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్నిగతంలోనే పలుమార్లు బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా స్పందించలేదని చెప్పారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామానికి చెందిన నిండు గర్భిణీ జాలమంచి అంజలి గురువారం బ్యాంక్ పని మీద పై అంతస్తులో ఉన్న బ్యాంకు వచ్చారని, మెట్లు ఎక్కడంతో తీవ్ర రక్తస్రావం జరిగి కుప్పకూలిపోయారని తెలిపారు. ఆస్పత్రికి తరలించగా శిశువు మరణించిందని, అంజలి ప్రయివేట్ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఖాతాదారుల సౌకర్యార్థంపై బ్యాంకును కిందికి మార్చాలని కోరారు. బ్యాంకు మేనేజర్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం నాయకులు హనుమంతు, చిన్న కోసిగయ్య, శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తాయన్న, జలీల్, ఆటో యూనియన్ నాయకులు వీరేష్, వీరారెడ్డి, వెంకటేశులు పాల్గొన్నారు.

మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

# 'చలో విజయవాడను జయప్రదం చేయండి'

**ప్రజాశక్తి - ఆదోని**

అంగన్వాడీలకు వేతనం పెంచాలని ఈనెల 10న నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. శుక్రవారం సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.వెంకటమ్మ, ప్రాజెక్టు అధ్యక్షులు వరలక్ష్మి ఐసిడిఎస్ కార్యాలయ పరిపాలనాధికారి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దశలవారీగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో చలో విజయవాడ ఆందోళనకు పూనుకున్నామని తెలిపారు. అంగన్వాడీ నాయకులు కరుణ, శశికళ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, అర్బన్ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి, కె.శైలజ, సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు, అధ్యక్షులు బి.గోవిందు మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, గ్రాట్యుటీ, పింఛను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు మల్లేశ్వరి, వరలక్ష్మి, యుఎం.నాగలక్ష్మి, మున్ని, శకుంతలమ్మ, హబీబా, షమీం, జయమ్మ పాల్గొన్నారు.

ఆదోనిలో వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

# చిన్నపిల్లలకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి : ఎంపిడిఒ

**ప్రజాశక్తి - ఆస్పరి**

పుట్టిన చిన్న పిల్లలకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపిడిఒ గీతా వాణి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసిడిసి సూపర్‌వైజర్ శివలింగమ్మ అధ్యక్షతన అంగన్వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పుట్టిన ఏడాది వరకు తహశీల్దార్ బర్త్ సర్టిఫికెట్ ఇస్తారని, ఏడాది నుంచి ఆపై వారికి ఆర్‌డిఒ కార్యాలయంలో బర్త్ సర్టిఫికెట్ ఇస్తారని తెలిపారు. ఆధార్ కార్డు దింపాలంటే బర్త్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. మండలంలో జరుగుతున్న డోర్ టు డోర్ 0.6 సర్వేలో భాగంగా ఏ గ్రామంలో ఎక్కువ ఆధార్ లేనివారు ఉంటారో ఆ గ్రామంలోని సచివాలయంలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. మండలానికి మూడు ఆధార్ కిట్లు వచ్చాయని, సోమవారం ఆస్పరి, జొహరాపురం, కైరుప్పల సచివాలయాల్లో క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతా వాణి

# సమాచారమివ్వడంపై సెక్రటరీ నిర్లక్ష్యం

**- ఫోరం ఫర్ ఆర్‌టిఐ జిల్లా కన్వీనర్ విజయ కుమార్**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి సంబంధించి గ్రామ పంచాయతీ నిధుల ఖర్చు గురించి ఆర్‌టిఐ యాక్ట్ కింద సమాచారం ఇవ్వాలని కోరానని, దీనిపై ప్రస్తుత కార్యదర్శి రామకృష్ణ నిర్లక్ష్యం చేస్తున్నారని ఫోరం ఫర్ ఆర్‌టిఐ జిల్లా కన్వీనర్ విజయ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. సమాచారం కోసం జిల్లా పంచాయతీ కార్యాలయానికి సమాచార హక్కు చట్టం ద్వారా నవంబర్ 14, 2024న రిజిస్టరు పోస్టు ద్వారా పంపానని, వారికి అదే నెల 18న ముట్టిందని తెలిపారు. ఇక్కడి ప్రజా సమాచార అధికారి మండల అభివృద్ధి కార్యాలయానికి నవంబరు 22న సమాచారం ఇవ్వమని లేఖ పంపారని చెప్పారు. సుమారు మూడు నెలలు కావస్తున్నా ఇంతవరకు సమాచారం ఇవ్వలేదని, ప్రస్తుత ఇన్‌ఛార్జీ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామకృష్ణను సమాచారం అడిగితే 'నాకు అప్పటి పంచాయతీ సెక్రటరీ (మహేష్) పంచాయతీ రికార్డులు ఇవ్వలేదని చెప్పారని అన్నారు. జిల్లా అధికారులు సమాచారం ఇవ్వమని ఆదేశించినా ఇక్కడ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పంచాయతీ రికార్డులను తారుమారు చేయాలనే ఉద్దేశంతో సమాచారం ఇవ్వడం లేదని అనుమానాలు కలుగుతున్నాయని, ఈ విషయంపై కలెక్టర్, డిపిఒకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# 'కాటికాపరుల సమస్యలు పరిష్కరించండి'

**ప్రజాశక్తి - మంత్రాలయం**

కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని సంఘం నాయకులు జి.సురేష్, మారెప్ప కోరారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని మాధవరం గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి సోదరులు ఎన్.రామకృష్ణారెడ్డిని కలిసి కరపత్రం అందజేసి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్మశానాల్లో గుంతలు తీసి పూడ్చడం, కాల్చడం చేసే కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈనెల 11న చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, అనిల్, దేవి పుత్ర, చెట్నిహల్లి గ్రామ కాటికాపరులు విజయ్, ఏసు బాబు, యాకోబు, డేవిడ్, బద్రి, మాధవరం కాటికాపరులు ఇస్సాక్, వీరేష్, చిన్న తిక్కన్న, హనుమంతు, అశోక్, ఆంజనేయ పాల్గొన్నారు.

# 'ఎస్సీ' సర్టిఫికెట్ రద్దు చేయాలి'

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

గ్రామ/వార్డు సచివాలయాల బోర్డుల్లో ప్రదర్శించిన జాబితా నుంచి మాదాసి/మాదారి కురువల పేరుతో నమోదైన బీసీ 'బి' కురువ పేర్లను తొలగించి, ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేయాలని కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు సుమాల ఆంథోని, సుమాల రాజు, ఎం.గుండప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ప్రాంతంలో లేని మాదాసి/మాదారి కురవల గురించి ఎమ్మెల్యే బీవీ అసెంబ్లీలో మాట్లాడటం శోచనయమని విమర్శించారు. కెవిపిఎస్ నాయకులు రంగన్న, ఈరన్న, ఏసన్న, ప్రకాశం, నాగరాజు, దావీదు పాల్గొన్నారు.

# విద్యార్థినిపై ఆకతాయిల దాడి

**- సిసి ఫుటేజ్‌లో రికార్డు అయిన ఆకతాయిల చిత్రాలు**

**ప్రజాశక్తి - నందవరం**

నందవరం మండలం ముగతి గ్రామంలో పట్టపగలు.. నడిరోడ్డుపై 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఏంజెల్(14)పై ఇద్దరు గుర్తు తెలియని ఆకతాయిలు దాడి చేసిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. విద్యార్థిని వివరాల మేరకు... గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఎమ్మిగనూరులో ఏంజెల్ చదువుతున్న గర్ల్స్ హైస్కూల్‌కు వెళ్లేందుకు రోడ్డుపై నిలబడి ఉన్నారు. స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు ఉదయం పూట పరీక్షలు ఉండడంతో స్కూల్ సమయం మధ్యాహ్నం ఉంది. ఏంజెల్ స్కూల్‌కు వెళ్లేందుకు బస్సు కోసం నిలబడి ఉన్నారు. ఎమ్మిగనూరు వైపు నుంచి బైక్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బైక్ ఆపి ఏంజెల్‌ను బైక్ ఎక్కాల్సిందిగా బెదిరించారు. ఆమె నిరాకరించడంతో ఆమెపై ఇద్దరు భౌతికదాడికి పాల్పడడంతో భయపడి గట్టిగా కేకలు వేశారు. పక్కన ఇంట్లో ఉన్న మహిళ బయటికి వచ్చారు. అప్పుడు ఆ ఆకతాయిలు నందవరం వైపు పరారయ్యారు. ఆ దాడిలో ఏంజెల్ కింద పడిపోయారు. ప్రాణ భయంతో స్కూల్‌కు వెళ్లకుండా ఏడుస్తూ ఇంటికి వెళ్లారు.

**అమ్మాయి భయభ్రాంతులకు గురైంది**

ఆకతాయిల దాడిలో అమ్మాయి భయాందోళనకు గురైందని విద్యార్థిని మామ ఈరన్న, తాత, అవ్వ తెలిపారు. 'విద్యార్థిని తండ్రి హనుమంతు, తల్లి సత్యమ్మ వలస వెళ్లారు. దాడి జరగడంతో పాప భయపడి ఇంటికి ఏడ్చుకుంటూ వచ్చింది. ఆకతాయిలు దాడి చేయడం వల్ల విద్యార్థిని దవడలు వాచీ ఉన్నాయి. భయంతో జ్వరం వచ్చి పడుకుంది. దాడి జరిగిన సమయాన్ని బట్టి గ్రామంలో ఉన్న పెట్రోల్ బంక్ సిసి ఫుటేజ్‌లో చూడగా ఇద్దరు వ్యక్తులు మాస్క్‌తో బైక్‌పై వెళ్లినట్లు రికార్డు అయింది. సిసి ఫుటేజ్‌లో రికార్డు అయిన ఆ వ్యక్తులే దాడికి పాల్పడినట్లు అమ్మాయి తెలిపింది' అని వారు వివరించారు. ఎస్ఐకి ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపామని, ఆయన చెప్పిన ప్రకారం శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. నందవరం, ముగతి, ఎమ్మిగనూరు సిసి ఫుటేజ్‌ల ఆధారంగా విచారణ చేపడతామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

సిసి ఫుటేజ్‌లో రికార్డు అయిన ఆకతాయిల చిత్రాలు

# తాగునీటి సమస్య రాకుండా చర్యలు

**- ఎంపిడిఒ అల్లా బకాష్**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

మండలంలోని 13 పంచాయతీల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలు కూడా ట్యాంకులు, నీటి కుళాయిల వద్ద తాగునీటిని వృథా చేయకూడదని సూచించారు. చిప్పగిరి ఎస్సీ కాలనీ ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా పైపు లైనుకు ప్రత్యేక వాలు ఏర్పాటు చేసి తాగు నీటిని అందిస్తామన్నారు. నేమకల్లు పంచాయతీలోని మజరా గ్రామమైన సంగాలలో శుద్ధి జల కేంద్రానికి విద్యుత్ అధికారులు విద్యుత్‌ను తొలగించిన నేపథ్యంలో తక్షణమే విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన ఇఒఆర్‌డి బాలన్నను అభినందించారు.

# దొంగకు దేహశుద్ధి

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని పట్టణ శివారు ప్రాంతం వైపిఆర్ కాలనీలో పట్టపగలు ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగను పట్టుకొని చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... వైపిఆర్ కాలనీలో నివాసముంటున్న గూళ్యం రమేష్ తమ కుమారునికి ఆరోగ్యం బాగా లేనందున చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లారు. ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. గమనించిన దొంగ మధ్యాహ్న సమయంలో ఇంటి తాళాలు తీసి బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారు, ఐదు తులాల వెండి తీసుకెళ్లుండగా కాలనీ యువకులు వెంబడించి దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

# 9న కప్పట్రాళ్లలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి - దేవనకొండ**

మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో రాష్ట్ర ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ అభ్యర్థన మేరకు సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. శిబిరంలో ఎముకల వ్యాధి స్పెషలిస్టు, స్త్రీవ్యాధి నిపుణులు, కంటి చూపు సమస్యలు అన్ని రోగాలకు సంబంధించిన వైద్య నిపుణులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు చెప్పారు.

# మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

**- రావూస్ డిగ్రీ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

మాట్లాడుతున్న ఎమ్మిగనూరు సివిల్ కోర్టు జడ్జి పడిగే హేమ

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎమ్మిగనూరు సివిల్ కోర్టు జడ్జి పడిగే హేమ, రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ బి.సుజనారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో సిఇఒ సుజనారెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్త్రీ లేకపోతే జననం లేదు.. స్త్రీ లేకపోతే గమనం లేదు.. స్త్రీ లేకపోతే సృష్టే లేదని తెలిపారు. ప్రతి మహిళా ఒక శక్తిగా మారాలని సూచించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణించాలని కోరారు. నేటి సమాజంలో మహిళలు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తున్నప్పటికీ దేశంలో మహిళలపై లింగ వివక్షత, లైంగిక దాడులు, గృహ హింసలాంటి దురాచారాలు అక్కడక్కడ జరుగుతున్నాయని, వాటిని రూపుమాపడానికి మహిళలందరూ ఐకమత్యంతో నడుంబిగించి పోరాడాలని తెలిపారు. మహిళా సాధికారత విద్య ద్వారానే సాధ్యమని, ప్రతి బాలికను చదివించాలని సూచించారు. ముఖ్యఅతిథులకు కళాశాల సిఇఒ సుజనా రెడ్డి, మహిళా అధ్యాపకులు శాలువా వేసి సన్మానించారు. వివిధ రకాల నాటికలు, సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించి మహిళాశక్తి సాధికారత ఆనందోత్సవంలో మునిగితేలారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విజేతగా సెకండ్ ఇయర్ స్టాటిస్టిక్స్ ఆనర్స్ విద్యార్థిని ఎస్.సుప్రియ, రెండో స్థానంలో నిలిచిన సెకండ్ ఇయర్ హిస్టరీ ఆనర్స్ విద్యార్థిని కె.తేజస్విని, మూడో స్థానంలో నిలిచిన సెకండ్ ఇయర్ బికాం ఆనర్స్ విద్యార్థిని బి.నిహర్షిత బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మిగనూరు బార్ కౌన్సిల్ అధ్యక్షులు గురు రాజారావు, పట్టణ ఎఎస్ఐ నాయక్, మహిళా అడ్వకేట్లు విమల, జబిత, కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, ప్రిన్సిపల్ ఇర్ఫాన్, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జీ విజయకుమార్, స్క్రిప్ట్ రైటర్ పాల రాజ్, మహిళా అధ్యాపకులు నందిని, అన్నపూర్ణ, రాజేశ్వరి, శ్రుతి ప్రియా, సంధ్య, అధ్యాపకేతర సిబ్బంది విద్యారెడ్డి, ప్రభావతి పాల్గొన్నారు.

# ప్రజా పోరాటంతో సమస్యకు పరిష్కారం : సిపిఎం

**ప్రజాశక్తి - ఆలూరు**

ప్రజల పోరాటంతో సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలూరులో 167వ జాతీయ రహదారి నిర్మాణ పనులు ఇదేళ్ల క్రితం మొదలై ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో రోడ్లు గుంతలమయంతో దుమ్ము ధూళితో స్థానిక వ్యాపారులు, ప్రజలు, వాహన దారులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. వామపక్షాల మద్దతుతో మూడు వారాల క్రితం స్థానికులు జాతీయ రహదారిపై గంట పాటు రాస్తోరోకో చేపట్టి నిరసన నిర్వహించారని చెప్పారు. స్థానిక ఎస్ఐ దిలీప్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రజల సమక్షంలో సమస్యపై జాతీయ రహదారి డిఇతో మాట్లాడి 20 రోజుల్లో బిటి రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇవ్వడంతో రాస్తోరోకో విరమించినట్లు గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణం చేపడుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై వామపక్షాలు ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటాయని తెలిపారు. సహకరించిన ఎస్ఐ దిలీప్ కుమార్‌కు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలూరులో గుత్తేదారు చేపడుతున్న బిటి రోడ్డు నిర్మాణం

# హోలి సంబరాలు ప్రారంభం

**ప్రజాశక్తి - హోళగుంద**

రాష్ట్ర సరిహద్దు మండలం హోళగుందలో కర్ణాటక జానపద సాంస్కృతిక కార్యక్రమాలు నేటికీ కొనసాగుతున్నాయి. శుక్రవారం హోళగుందలో హోలి సంబరాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఈ రమణీయమైన కార్యక్రమం శ్రీఉరవకొండ మహస్వాముల మఠం నుంచి మేళతాళాలతో, బీరప్ప డోళ్లు, తప్పెట, సకల వాయిద్యాలతో పురవీధుల గుండా యువకులు మహిళల వేషధారణలో కుంభోత్సవాన్ని మోసుకొని ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం మఠం వద్దకు చేరుకొని కమన్నకు బలిదానం, కామనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు తమ పంటలు చేతికందిన తర్వాత ఇక్కడి ప్రజలు, యువకులు కలిసి కట్టుగా ఉత్సహంగా పాల్గొని ఆందోత్సవంతో ఈ పండగ జరుపుకుంటారు. రోజు ఒక్కో రకమైన హాస్య సన్నివేశాలను వేసి, వారం రోజుల పాటు ప్రదర్శించి ప్రజలను సంతోషింపజేస్తారు. చివరి రోజు కామ దహనం, ఇతర నాటకాలు, సన్నివేశాలతో ముగిస్తారు. అలాగే 6వ రోజు ఏనుగు మీద కమన్నను ఊరేగించి, అర్ధరాత్రి కామ దహనం నిర్వహిస్తారు. చివరి రోజున మృతదేహం ఊరేగింపు, వివాహ వేడుకల ఊరేగింపు, రంగుచెల్లుట (వసంతోత్సవం)తో కార్యక్రమం ముగుస్తుందని భక్తులు తెలిపారు.

# అభివృద్ధి పథంలో టౌన్ బ్యాంకు

**- చైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆశీస్సులతో ఎమ్మిగనూరు టౌన్ బ్యాంకు కార్యవర్గం ఏర్పడిన నెల రోజుల్లో అభివృద్ధి పథంలో నడిచిందని టౌన్ బ్యాంకు చైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి పేర్కొన్నారు. శుక్రవారం నెల రోజులు పూర్తయిన సందర్భంగా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... నెలరోజుల్లోనే ఒక గొప్ప మార్పును తీసుకొచ్చామని తెలిపారు. లోన్ దాదాపు రూ.1,88,81,000 మంజూరు చేసినట్లు, దాదాపు రూ.1,40,01,018.60 రికవరీ చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ఇదే తరహాలోనే బ్యాంకు పనితీరు కొనసాగుతుందని, అర్హులందరికీ రుణాలు అందజేస్తామని తెలిపారు. లోన్ ఉన్న ఖాతాదారులకు మంచి సేవలందిస్తామని చెప్పారు.

మాట్లాడుతున్న చైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి

# ప్రభుత్వ ఆస్తుల గుర్తింపు ముమ్మరం

**- తహశీల్దార్ కుమారస్వామి**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో భాగంగా పైలట్ గ్రామం గోనెగండ్లలో ప్రభుత్వ ఆస్తుల గుర్తింపు కార్యక్రమం వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కుమారస్వామి తెలిపారు. శుక్రవారం గోనెగండ్ల గ్రామంలో పోలీసు స్టేషన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆస్పత్రి, లైబ్రరీ భవనం రీసర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ అబ్దుల్ వాహీద్, విఆర్ఒ కిషోర్, సచివాలయ సర్వేయర్లు సందీప్, కృష్ణమూర్తి, విఆర్ఎలు మోహన్, దస్తగిరి పాల్గొన్నారు.

# శాసించే స్థాయికి ఎదిగాం

**- ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి**

**- జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప**

**ప్రజాశక్తి - ఆదోని**

రాజకీయాల్లో మద్దతుకు తప్ప ప్రత్యక్ష రాజకీయాలకు పవన్ పనికి రారని అన్న నోళ్లే మెచ్చుకుంటున్నాయని, శాసించే స్థాయికి ఎదిగామని జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప తెలిపారు. శుక్రవారం ఆదోని పట్టణ శివారులో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమ కోఆర్డినేటర్ చింతా సురేష్ బాబు హాజరయ్యారు. ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేద్దామని గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జనసేన నాయకులు, కార్యకర్తలపై దమనకాండ కొనసాగిస్తూ అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక జరుగుతున్న తొలి సభ కావడంతో జనసైనికులు, వీర మహిళలు రెట్టింపు ఉత్సాహంతో సభకు తరలి రావాలని కోరారు. నాయకులు రేణు వర్మ, తాహెర్ వలీ, రాజశేఖర్, పులి రాజు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, ప్రకాష్, ఉరుకుంద, నెల్లిబండ రాజశేఖర్, విక్రమ్, తరుణ్ పాల్గొన్నారు.

# చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి : విట్టా రమేష్

**ప్రజాశక్తి - ఆదోని**

రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతోందని, జనం రద్దీగా ఉండే కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని పారిశ్రామిక వేత్త విట్టా రమేష్ తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని విశ్వనారాయణ జూనియర్, ఒకేషనల్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈఏడాది ఎండల తీవ్రత పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని, వడదెబ్బ బారిన పడకుండా తరచూ నీరు తాగాలని సూచించారు. పాదచారులు, వాహనదారుల సౌకర్యార్థం చలివేంద్రాలు నెలకొల్పి ప్రజల దాహార్తి తీర్చాలన్నారు. మున్సిపల్ అధికారులు కూడా శ్రద్ధ తీసుకొని నీటి కొరత రాకుండా చలివేంద్రాలకు సరఫరా చేయాలని తెలిపారు. ప్రిన్సిపల్ మల్లికార్జున ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడంతో అభినందించారు. ప్రిన్సిపల్ మల్లికార్జున మాట్లాడుతూ... కళాశాల తరపున ప్రతేడాది సీజనల్‌కు సంబంధించిన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**CHANGE IN SURNAME**

I, MANDE RAJAMMA (Old Name) R/o.H.No:87-1388-1-A-61, Jayaram Nagar, Near Nandikotur Road, kurnool dist, AP., have Changed my surname as MENDE RAJAMMA (New Name) W/o. MENDE CHINNA RANGAIAH

**CHANGE IN SURNAME AND NAME**

I, MANDE RANGAIAH (Old Name) R/o. H.No:87-1388-1-A-61, Jayaram Nagar, Kurnool dist, AP., have Changed my surname and name as MENDE CHINNA RANGAIAH (New Name) S/o.MENDE CHINNA VEERANNA

**ಕರ್ನಾಟಕ ಸರ್ಕಾರ**
**(ಸಹಕಾರ ಇಲಾಖೆ)**
**ಸಹಕಾರ ಸಂಘಗಳ ಉಪ ನಿಬಂಧಕರು (ನಿ.,441), ಸೌಹಾರ್ದ ಸಹಕಾರಿಗಳ ದಾವಾ ಪಂಚಾಯ್ತಿ ನ್ಯಾಯಾಲಯ, ಕರ್ನಾಟಕ ರಾಜ್ಯ ಸೌಹಾರ್ದ ಸಂಯುಕ್ತ ಸಹಕಾರಿ ನಿಯಮಿತ, ಬೆಂಗಳೂರು ''ಸೌಹಾರ್ದ ಸಹಕಾರಿ ಸೌಧ''**
#68, 1ನೇ ಮಹಡಿ, 17&18ನೇ ಅಡ್ಡರಸ್ತೆ ಮಧ್ಯೆ, ಮಾರ್ಗೋಸಾ ರಸ್ತೆ, ಮಲ್ಲೇಶ್ವರಂ, ಬೆಂಗಳೂರು-560055

**ವಾದಿ : ಮುಖ್ಯ ಕಾರ್ಯನಿರ್ವಾಹಣಾಧಿಕಾರಿ**
ಶ್ರೀ ಭ್ರಮರಾಂಭ ಪತ್ತಿನ ಸೌಹಾರ್ದ ಸಹಕಾರಿ ಸಂಘ ನಿ., ತೇರ್ ಬಜಾರ್, ಮಸ್ಕಿ - 584124 ಜಿ : ರಾಯಚೂರು.
**ವ್ಯಾಜ್ಯ ಸಂಖ್ಯೆ: ಡಿ.ಆರ್.ಡಿ/ಕ.ರಾ.ಸೌ.ಸಂ.ಸ.ನಿ/1156/2024-25**
**ಪ್ರತಿವಾದಿ**
**1 (ಎ) ಶ್ರೀಮತಿ ಜೆ. ಆಸಿಯಾ ಬೀ ಗಂಡ ಉಸ್ಮಾನ್,**
ಸಾ: ವಾರ್ಡ್ ನಂ.6, ಮಸೀದಿ ಹತ್ತಿರ, ಪಿಂಜಾರ ಓಣಿ, ಪೋ : ತಾ : ಆದೋನಿ, ಜಿ : ಕರ್ನೂಲ್- 518301.
**1(ಸಿ) ಶ್ರೀಮತಿ ಗೌಸಿಯಾ ಗಂಡ ಖಲೀಮುಲ್ಲಾ ಬಿ,**
ಸಾ: ಮನೆ ನಂ.9/4, 16ನೇ ವಾರ್ಡ್, ಬಾಲಾಜಿ ರಾವ್ ರೋಡ್, ವಡ್ಡರಬಂಡೆ, ಬಳ್ಳಾರಿ- 583101.

**ಪ್ರತಿವಾದಿಗಳಿಗೆ ಪತ್ರಿಕಾ ಪ್ರಕಟಣೆ ಮೂಲಕ ನೋಟೀಸ್**

ಈ ಮೇಲ್ಕಂಡ ವಿಷಯಕ್ಕೆ ಸಂಬಂಧಿಸಿದಂತೆ, ನಿಮಗೆ ತಿಳಿಯಪಡಿಸುವುದೇನೆಂದರೆ ಈ ಮೇಲ್ಕಂಡ ಪ್ರತಿವಾದಿಗಳ ದಾವಾ.ಸಂಖ್ಯೆ: ಡಿ.ಆರ್.ಡಿ/ಕ.ರಾ.ಸೌ.ಸಂ.ಸ.ನಿ.,/1156/2024-25ರಂತೆ ಸಹಕಾರ ಸಂಘಗಳ ಉಪ ನಿಬಂಧಕರು(ನಿ.,441), ಸೌಹಾರ್ದ ಸಹಕಾರಿಗಳ ದಾವಾ ಪಂಚಾಯಿತಿ ನ್ಯಾಯಾಲಯದಲ್ಲಿ ಪರಿಹಾರ ಕರಾರು ಅಡಿಯಲ್ಲಿ ದಾವೆಯನ್ನು ಸಲ್ಲಿಸಿದ್ದು, ನೀವು ಪ್ರತಿವಾದಿಯಾಗಿರುತ್ತೀರಿ, ಆದುದರಿಂದ ಈ ಮೂಲಕ ನಿಮಗೆ ತಿಳಿಯಪಡಿಸುವುದೇನೆಂದರೆ ಈ ಮೇಲ್ಕಂಡ ನ್ಯಾಯಾಲಯದ ಮುಂದೆ ದಿನಾಂಕ 20.03.2025ರಂದು ಬೆಳಿಗ್ಗೆ 11-30 ಗಂಟೆಗೆ ಸರಿಯಾಗಿ ತಾವಾಗಲಿ, ತಮ್ಮಿಂದ ನೇಮಕಗೊಂಡ ವಕೀಲರ ಮುಖಾಂತರವಾಗಲಿ ಹಾಜರಾಗಲು ಈ ಮೂಲಕ ತಿಳಿಯಪಡಿಸುತ್ತೇವೆ. ತಪ್ಪಿದಲ್ಲಿ ನಿಮ್ಮ ಗೈರುಹಾಜರಿಯಲ್ಲಿ ಪ್ರಕರಣವನ್ನು ಏಕಪಕ್ಷೀಯವಾಗಿ ಇತ್ಯರ್ಥಪಡಿಸಲಾಗುವುದು.

ಸದರಿ ಪ್ರಕಟಣೆಯನ್ನು ದಿನಾಂಕ: 04.03.2025ರಂದು ನ್ಯಾಯಾಲಯದ ಮೊಹರಿನೊಂದಿಗೆ ನೀಡಲಾಗಿದೆ.

ಸಹಿ/-
ಸಹಕಾರ ಸಂಘಗಳ ಉಪ ನಿಬಂಧಕರು (ನಿ.441)
ದಾವಾ ಪಂಚಾಯ್ತಿ ನ್ಯಾಯಾಲಯ
ಕ.ರಾ.ಸೌ.ಸಂ.ಸ.ನಿ, ಬೆಂಗಳೂರು
(ನ್ಯಾಯಾಲಯದ ಆದೇಶದ ಮೇರೆಗೆ)